ఓం హ్రీం శ్రీం

# శ్రీవాసవి కన్యకాదేవి పురాణము

## ద్వాదశాధ్యాయము

### కుసుమశ్రేష్ఠి విషాదయోగము :-

వైశ్య సభానంతరము నిజప్రాసాదమునకు వచ్చిన కుసుమశ్రేష్ఠి భోజనమైననుచేయ మనస్కరించక శయ్యాగృహమునకు చేరెను. మృదుతల్పముపై కూర్చొని దీర్ఘములైన నిట్టూర్పులు విడచుచు ఆలోచనా నిమగ్నుడై "అకటా బహుకాలము సంతానము లేనివాడై సకలదేవతలను ప్రార్థించి చివరకు పుత్రకామేష్ఠి యాగమొనర్చి దివ్యగుణ సంపన్నయు అతిలోకసుందరియునైన పుత్రికను పొందగల్గితిని. యుక్తవయస్కయైన నా బిడ్డకు కులమందలి సుయోగ్యుడైన వరునితో వివాహము గావించి ఆమె ముద్దు ముచ్చటలు కన్నులారగాంచవలెనని ఎన్నెన్నో కలలుగంటిని. కాని నా పూర్వకర్మ దుష్కృత మెట్టిదియో కాని యిపుడిట్టి అనివార్యమైన కష్టము కలిగినది. శిరీషకుసుమ కోమల శరీరయైన నా చిన్నారి వాసవిని చటులాగ్ని జ్వాలలో ఎటుల పడవేయగలను? ఈ ఊహయే నా హృదయమును దహించి వేయుచున్నది. నా వంటి దౌర్భాగ్యుడు యీ ప్రపంచములో వేరొకడుండడు." అని దుఃఖించసాగెను. అట్లు వ్యాకులపడుచున్న తండ్రిని చూచి హిమవంతుని జేరిన పార్వతివలె వాసవీకన్యక జనకుని చెంతకరుదెంచినది. దురంత దుఃఖ పీడితుడైన తండ్రితో "తండ్రీ! నీవేల యిట్లు పరితపించుచున్నావు?" అని ప్రశ్నించెను. అంతట కుసుమశ్రేష్ఠి కుమార్తెను జూచి "బిడ్డా!

నా మనోవేదన నేమని చెప్పుదును. కుసుమకోమలము, సుందరాతిసుందరమునైన నీయా శరీరమును దిశలంటుమంటలో ఎట్లు పడవేయగలవు. ప్రాణము కంటె ప్రియమైన వస్తువు లేదుకదా. లోకులు తమ ప్రాణరక్షణార్థమై బంధుమిత్ర పుత్రకళాత్రాదులను సమస్త విధ సంపదలను విడచివేయుదురుగాని కులమర్యాదను రక్షించుటకును, ధర్మమును రక్షించుటకునై తమ ప్రాణములను విడుచువారుండిరా? లేక లేక వరప్రాదముగ లభించిన నిన్ను యిట్లు అకాల మృత్యువునకు బలిచేయనున్న నా వంటి దురదృష్టవంతుడును, దరిద్రుడును యీ యిలపై వేరొకడుండడు." అని విలపించసాగెను.

అపుడు వాసవీకన్యక "ఓ తండ్రీ! అశాశ్వతములైన యీ తనువుల సంబంధములకై వగచుట తగదు. నదీ ప్రవాహములో కొట్టుకొనిపోవు తృణములొకచోట ఒక క్షణకాలము పరస్పరము కలుసుకొని మరల విడిపోవునట్లే యీ సంసార సాగరమున బంధు, పుత్ర, మిత్ర, కళత్రాదులు కలిసికొనుచు విడిపోవుచునుందురు. జననమందిన భూజనులెల్లరకును మరణమందుట తప్పదు. మరణమందిన ప్రతివారు మరల జన్మించుట కూడ తప్పదు. పాంచభౌతికమైన యీ శరలీము అనిత్యమైనది. ఆత్మ ఒక్కటే నిత్యము. సత్యమునైనది. ఆత్మశస్త్రములచేత ఛేదింపబడదు. జలముచే తడుపబడదు. అగ్నిచే కాల్చబడదు వాయువుచే శోషింపజేయబడదు. అది నిర్వికారము, నిత్యము నిరంజనమునైననది. ఆత్మతత్త్వము నెఱిగినవాడు సర్వాధికమైన ఆనందమును పొందగలడు. వంశధర్మమును పాలించుటకై అస్థిరము, అశాశ్వతమునైన దేహమును తృణప్రాయముగ పరిత్యజించి పరమానంద నిలయమైన పరంధామమును పొందవలెను." అని ధీరవచనములతో తండ్రిని ఓదార్చుటకు యత్నించినది. ఐనను

దుఃఖమును వీడని జనకనిజూచి "ఓ తండ్రీ! నీకిప్పుడు మహోత్కృష్టమైన తత్త్వదర్శనమును కలిగించెదను. సావధాన చిత్తుడవై వినుము." అని యిట్లు చెప్పసాగెను.

నాకు తల్లిదండ్రులు, బంధువులు, శత్రుమిత్రులు, రక్షకులు ఎవ్వరునూ లేరు, నేనే సమస్త లోకములకు జననిని. విశ్వరూపిణిని. మాయచే భయభ్రాంతులై సమస్త ప్రాణులు మోహములో మునుగుచున్నారు., నీ అజ్ఞానమిక పటాపంచలు కాగలదు. లోకకళ్యాణార్థమై నేను నీ పుత్రికనై జన్మించితిని. నన్ను తెలిసికొను సామర్థ్యము నీకు చాలదు. నీకు నా నిజస్వరూపము తిలకించుటకై దివ్యదృష్టిని ప్రసాదించుచున్నాను. నా దివ్య రూపమును దర్శింపుము అని పలికి కుసుమశ్రేష్ఠి ఎదుట వాసవీకన్యక తన దివ్య స్వరూపముతో సాక్షాత్కరించినది. బాలభానుకోటి ప్రకాశముతో వికసిత జపాకుసుమ రాగారుణ శరీరకాంతితో, శిరోభూషణమైన చంద్రరేఖతో, నక్షత్ర హారములతో, రత్న కాంచన కర్ణాభరణములతో, మణిమయ కాంచీగుణములతో, సువర్ణాంబరధారిణియై పద్మవేద వరదాభయ ముద్రలను ధరించిన చతుర్బాహువులతో, పద్మాసనస్థితయై ప్రత్యక్షమైన ఆ దేవదేవిని కుసుమశ్రేష్ఠి తిలకించి సాష్టాంగదండ ప్రణామము లాచరించి పరిపరివిధముల స్తుతించెను.

## శ్రీ వాసవీదేవీ గీతా ప్రబోధము :-

అటుపై ఆ దేవితో "ఓ పరమేశ్వరీ! దేనివలన నీవే నేనగుదునో అట్టి జ్ఞానమును యోగమును దయతో నాకుపదేశింపుము." అని ప్రార్థించెను.

కుసుమ శ్రేష్ఠి ప్రార్థనను విన్న దేవి ప్రసన్నురాలై సర్వోపనిషత్సారమైన రహస్య జ్ఞానమును యీ విధమున ఉపదేశించనారంభించినది. "ఓ వైశ్యోత్తమా! సమస్త సృష్టికన్న

మున్ను నేనేయుంటిని. ఆత్మరూపిణియైన నేనే పరమాత్మను. చిత్తు, సంవిత్తు, పరబ్రహ్మ అనుననవి నా ప్రధాన నామములు. నా తత్వము అవాఙ్మానస గోచరము. అది కేవలము శృతిప్రామాణ్యము చేత మాత్రమే తెలియదగినది. అనాది సిద్ధమైన నా శక్తి మాయ, ప్రకృతి అను నామములతో పిలువబడుచున్నది. ప్రతినిత్యము గాఢ నిద్రయందు మనమొనరించు పనులన్నియు యెట్లు లయించునో, అట్లే జీవులు, కర్మలు, కాలములన్నియు మహాప్రళయమందు నా మాయలో లీనమైయుండును. అందువలన జీవులకు వారి కర్మపరిపాకముల ననుసరించి నా చేత ఫలము లొసగబడుచున్నవి. నేను సత్యాది త్రిగుణములకు అతీతనైనను జీవకర్మకాలములతో కలసియుండిన నా మాయాశక్తి వలన సృష్టిస్థితిలయములకు కారణమగుచున్నాను.

తండ్రీ! ఏ మాయా శక్తిచేత సకల చరాచర ప్రపంచము కల్పించ బడినదో ఆ మాయాకూడ నాయందు కల్పించబడినదే యగుట వలన అది మిథ్యయే అగును. కనుక నా స్వరూపము కన్న వేరేదియునులేదు. మిథ్యయగు ఆ మాయ అనాదియైన అజ్ఞానమువలన భ్రమనొందిన వారి వ్యవహార సంబంధమగు దృష్టిచేత అవిద్య అనుపేరుతో ప్రసిద్ధమగుచున్నది. అట్లుగాక పరమాత్మ దృష్టితో చూచినచో ఆ మాయాలేనేలేదు. కేవలము బ్రహ్మతత్త్వమే వున్నది. బ్రహ్మరూపిణినైన నేను సమస్త జగత్తులను సృజించి, ఘటములోని ఆకాశమువలె అద్దమునందలి ప్రతిబింబమువలె జగమందు చిదాభాసరూపములో ప్రాణములను ముందిండుకొని ప్రవేశించుచున్నాను. ఉత్తమాధమములైన సమస్త వస్తువులను ప్రకాశింపజేయుచున్న సూర్యుడు ఆ వస్తుగత గుణదోషములచేత యెట్లు అంటబడడో, అట్లే నేను కూడ ఉపాధిగత గుణదోషములతో ఎన్నడును అంటపడను. కాని అజ్ఞానులగు జనులు బుద్ధి మొదలగు వాని యందుండు కర్తృత్వమును ఆత్మరూపిణినైన నాయందున ఆరోపించి నన్నేకర్తయని పలుకుదురు కాని

నేను సూర్యునివలె సాక్షిరూపిణినే గాని ఏమియును చేయుదానను కాను. నేను సమస్తమునకు సాక్షీభూతను. జగత్తునకు నేత్రమును నేనే. నేను వ్యక్తముగాని రీతిలో సకల జగత్తులందున వ్యాపించియుందును నాకు వినాశము లేదు. నాశములేని ఆనందస్వరూపమగు పరబ్రహ్మమును నేనే. నా మాయ సకల జగత్తును మరియు ఉత్తమోత్తములైన దేవతలను మానవులను గూడమోహింప జేయుచున్నది. ఒకే త్రాడు పామువలె, మరియు పూలదండవలె యెట్లు ప్రకాశించుచున్నదో అట్లే జీవేశ్వరాది రూపములతో నేనే ప్రకాశించుచున్నాను. జీవబహుత్వము ఏర్పడినట్లే బ్రహ్మవిష్ణువు ఈశ్వరుడు మొదలైన దేవబహుత్వము కూడా మాయచే కల్పించబడినవి. అనగా అజ్ఞానభేదము వలన జీవబహుత్వము, మాయాభేదము వలన దేవబహుత్వము ఏర్పడినవి. ఆకాశమునకు ఘటాకాశము, మఠాకాశము, మహాకాశము అని భేదము కల్పింపబడినట్లే చైతన్య రూపిణినైన నాకు జీవుడని, ఈశ్వరుడని భేదము కల్పించబడినదిగాని నేనే సర్వరూపిణిని. సచ్చిదానంద రూపిణినైన నాయందే ప్రపంచమంతయు నిండియున్నది.

రాజా! నేనే బ్రహ్మను. నేనే విష్ణువును. నేనే శివుడను. నేనే శక్తిని, నేనే సూర్యుడను. నేనే గణపతిని. నా నుండియే సమస్త చరాచర సృష్టి ఏర్పడినది. మానవుడు సదుపదేశ ప్రాప్తినంది విరక్తుడై అరిషడ్వర్గమును జయించి ఛేదింపరాని, దహింపలేని, నీటితో తుడుపబడని, గాలికి ఎండిపోని, దేహము నశించినను నాశనము కాని శాశ్వత శుద్ధచైతన్య స్వరూపాత్మను నన్ను తెలుసుకొని ఆత్మసాక్షాత్కారమును పొందుచున్నాడు." అని తన తత్త్వ రహస్యమును తెలియజేసినది.

అంత కుసుమ శ్రేష్ఠి ఆ దేవిని జూచి "ఓ పరమేశ్వరీ! ఏ యోగము వల్ల నేను ఆత్మ సాక్షాత్కారమును పొందగలనో ఆ ప్రజ్ఞానసాధకమైన యోగమును సాంగముగ నాకు ప్రబోధింపుము." అని ప్రార్థించెను.

అంతదేవి ఓ వైశ్య భూపాలా! జీవాత్మ పరమాత్మలను ఏకత్వమును భావించు వృత్తియే యోగమనబడును. ఈ అభేద జ్ఞానవృత్తికి కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు అను ఆరును విఘ్నకరులైన శత్రువులు. ఆ శత్రువులను జయించి యోగమును సాధించుటకై యమము - నియమము - ఆసనము - ప్రాణాయామము - ప్రత్యాహారము - ధారణము - ధ్యానము - సమాధి అను ఎనిమిది అంగములతో కూడిన అష్టాంగయోగమును అభ్యసించవలెను.

ఈ అష్టాంగయోగము యొక్క వివరణము వినుము. అహింస, సత్యవచనము, దొంగతనము చేయకుండుట, బ్రహ్మచర్యము, సర్వభూతదయ, తాను అందరికంటె తక్కువ అను వినయభావము, సహనము, ధైర్యము, మితాహారము, బహిరంతఃశుద్ధి అనునవి యమము లనబడును.

తపస్సుచేయుట, శృతిస్మృతులలో చెప్పబడిన కర్మలను చేయుట, లభించిన దానితో తృప్తిపడుట, దేవబ్రాహ్మణుల యందు వేదములందు విశ్వాసముంచుట, పాత్రతనెరిగి దానము చేయుట, పరమేశ్వరిని పూజించుట, వేదాంత వాక్యములను వినుట, తప్పుచేయుటకు సిగ్గుపడుట ఓంకారము, గాయత్రి మొదలైన దైవమంత్రాదులను జపించుట - నిత్యహోమములను ఆచరించుట అనునవి నియమములనబడును.

1. పద్మాసనము 2. స్వస్తికాసనము 3. భద్రాసనము 4. వజ్రాసనము 5. వీరాసనము అను ఐదువిధముల ఆసనములలో ఏదో ఒకదాని యందుండుట, లేక వెన్నెముకను నిటారుగ ఎక్కువ కాలముంచుటకు వీలగు స్థితిలో కూర్చుండుట ఆసనమనబడును.

ఎడమ ముక్కుపుటము ద్వారా వెలుపలివాయువును లోనికి పీల్చుకొని ఆ పీల్చిన వాయువును లోన నిలిపి అటుపై కుడిముక్కు ద్వారా మెల్ల మెల్లగ బయటకు విడచు ప్రక్రియను ప్రాణాయామ మందురు. దీనిని సద్గురువు నుండి అభ్యసించవలెను.

ప్రత్యాహారమనగ భోగవస్తువుల వైపు పరువులెత్తు యింద్రియములను బలాత్కారముగ ఆ విషయములనుండి మరలించుట.

ధారణము మరియు ధ్యానము అనగ మనస్సును నిగ్రహించి ఆత్మయందు నిలిపి యిష్టదేవతను స్మరించుట.

సమాధియనగ యోగస్థితిలో యుండి జీవాత్మ పరమాత్మలను అభేదముగ నిరంతరము చింతించుట. పై ఎనిమిది అంశములతో కూడినదే అష్టాంగయోగము.

చరాచరాత్మకమైన యీ ప్రపంచమున రెండు విధముల స్థితులున్నవి. అందుచే సాంఖ్యులకు జ్ఞానయోగము, కర్మనిష్ఠులకు కర్మయోగము ప్రధానము లైనవి. యిపుడు కర్మయోగసారమును వినుము. కర్మనిష్ఠులలో స్వర్గసుఖముల నాశించి పలువిధముల పుణ్యకర్మలనాచరించు వేదవాదపరులును, కర్మాచరణ పరాయణులు నిష్కామభావమును పొందరు. స్వర్గసుఖములందలి కోరికచే వారు తమ జ్ఞానమును కోల్పోవుదురు. అందువలన కొందరు కర్మత్యాగము చేయవలెనందురు కాని మానవుడెన్నడును కర్మను విడువరాదు. కర్మాచరణములేని పురుషుడు నిష్క్రియుడై

పోగలడు. ఏ మానవుడును యేపనియు చేయక క్షణకాలమైనను వుండజాలడు. అతడు ప్రకృతి సిద్ధములైన గుణములకు వశుడై క్రియోన్ముఖుడగును. ఏ పనియు చేయని వానికి శరీరయాత్ర జరుగదు గదా! కనుక కర్మచేయకుండుటకన్న నిష్కామముగ అనగా కర్మఫలమందు కోర్కెలేకుండ దైవార్పణ బుద్ధితో సకల కర్మల నాచరించుటయే శ్రేయస్కరము.

ఓ వైశ్యరాజా! కోరికలతో చేయు కర్మలు దేహికి బంధహేతువులగును. నా నిమిత్తమై చేయు కర్మలన్నియు బంధకారణములు కావు. భూపతీ! చిత్తశుద్ధి గొప్ప జ్ఞానదాయకమైన సాధనము. మహర్షులందరును జ్ఞానము చేతనే పరబ్రహ్మరూపిణినైన నన్ను తెలుసుకొనిరి. కర్మాచరణము వల్లనే చిత్తశుద్ధి చేకూరగలదు. చిత్తశుద్ధి వలన భేదబుద్ధి నశించును. ఆవిధమైన అభేదబుద్ధియే యోగ మనబడును. దానివలన అమృతత్వము సిద్ధించును. కర్మత్యాగము చేసినవాడు చిత్తశుద్ధిని పొందలేడు. చిత్తశుద్ధిని పొందక జ్ఞానమందు కొనజాలడు. కనుక ప్రతివ్యక్తియు స్వధార్మచరణపరుడై నిష్కామముగ కర్మనాచరించవలసినదే. అజ్ఞాన సాంగత్యము వలన కర్మాచరణ మొనర్చువాడు అహంకారముతో నేనే కర్తను అని భావించును. బుద్ధిమంతుడైన వాడు అహంకార మమకారాదులను వదలి తానాచరించువాడు నిత్యనైమిత్తిక కర్మలను నాకు సమర్పణగావించి ఉత్తమోత్తమ గతిని పొందగలడు. ఏ మానవులు ఈర్ష్యాద్వేషములను వదలి భక్తితత్పరులై నేను చెప్పిన యీ శుభ మార్గమును అనుసరింతురో వారు తప్పక సమస్త కర్మబంధముల నుండి విముక్తులగుదురు.

ఓ పుణ్యశీలి! మానవుల గుణకర్మ ఆచరించవలయును. పరధర్మము భయహేతువు. నిజమునకు స్వధర్మమనగ ఆత్మధర్మమని యెఱుగవలెను.,

ఓ వరేణ్యా! నా నుండి బ్రహ్మము ప్రభవించెను. ఆ బ్రహ్మము వలన కర్మముత్పన్నమైనది. దాని నుండి యజ్ఞము కలిగినది. కనుక యజ్ఞమందును సమస్త విశ్వమందును నేనే నిండి యున్నానని తెలిసికొనుము. మానవులు యజనాన్నముచేత నా విభూతులైన దేవతలకు తృప్తి కలిగించవలెను. తృప్తులైన దేవతలు వాంఛిత సుఖసంపదలను ప్రసాదింతురు. దైవమునకు నివేదించక అన్నము భుజించువాడు దొంగయనబడును. రాజా! నేనే అగ్నిని. హోమద్రవ్యమును, సోమయాజిని కూడా నేనే. నాకు సమర్పింపబడు ఆహుతిమంతయు బ్రహ్మమయమని తెలుసుకొనుటయే బ్రహ్మజ్ఞుని లక్షణము.

కొందరు యోగులు దేవతా సంబంధమైన దానినే యజ్ఞమను కొందరు. కొందురు జ్ఞానులు బ్రహ్మరూపాగ్ని యందు యజ్ఞము చేయుటయే యజ్ఞమందురు. కొందరు తపోధనులు సంయమరూపాగ్నియందు శ్రోత్రాదికములైన ఇంద్రియములను హవనము చేయుదురు. కొందరు జ్ఞానముతో ప్రజ్వలించు ఆత్మసంయమ రూపయోగాగ్నిలో ఇంద్రియములను, ప్రాణములను హవనము చేయుదురు. వీరి క్రియాఫలమంతయు ఆత్మలీనమగును. కొందరు వేదాధ్యయనాదులతోను, కొందరు జ్ఞానరూపమైన హవిస్సుతోను, నన్ను యజింతురు. ఈ రీతిగ వేద ప్రతిపాదితములైన పలువిధముల కాయిక, వాచిక మానసిక యజ్ఞములను తెలుసుకొని ఆచరించు వారు సకల బంధముల నుండి విముక్తులౌదురు. తమ పాపములను నశింప జేసికొందురు. నిజమునకు లోకహితార్థమై చేయబడు ప్రతికార్యము యజ్ఞమై భాసించునని తెలియవలెయును. నిత్యమూ యజ్ఞ ప్రసాదముగ ఆహారమును భుజించువారు బ్రహ్మపదమును పొందుదురు.

ఇప్పుడిక జ్ఞానయోగసారమును వినుము. ఓ రాజా! అన్నియజ్ఞములలోను జ్ఞానయజ్ఞము శ్రేష్ఠమైనది. మోక్షసాధనమైన జ్ఞానమునందే సకల కర్మఫలము లీనమగును. జ్ఞానులు సకల జగత్తులను వశపరచుకొని దయాళువులై వారి సదుపదేశములతో ప్రపంచమును పరిశుద్ధ మొనర్తురు. జ్ఞాన సంపన్నులు జీవన్ముక్త స్థితిని పొంది పరమానందమయి రసవాహినియందు మునిగి తమ హృదయములలో నెలకొన్న పరమాత్మనైన నన్ను నిమీలితనేత్రములతో దర్శింతురు. జ్ఞానయోగులు సకలప్రాణికోటిని తమతో సమానముగనే భావింతురు. సుఖదుఃఖములు, జయాపజయములు, లాభనష్టములు, మానవమానాములు మొదలైన సమస్త ద్వంద్వములను వారు సమదృష్టితో స్వీకరింతురు.

ఓ రాజా! పండితులైన మహాత్ములు బ్రాహ్మణుని యందును, చండాలుని యందును సమదృష్టి గలిగియుందురు. వారు సమస్త ప్రకృతియందు నేను నిండియున్నట్లు భావించి దర్శింతురు. జ్ఞాన బలముతో ఇంద్రియములను అరికట్టి అంతటను సమత్వబుద్ధి గల్గియుండుటయే జ్ఞానయోగమనబడును.

తాబేలు తన అవయవములన్నింటిని తనలోనికే ముడుచుకొనురీతిగ యోగి విషయ సుఖముల నుండి తన ఇంద్రియములను మరలించుకొని ఆత్మస్థితుడగును. అట్టివానినే స్థిరబుద్ధి అందురు. త్రివిధ దుఃఖములను నశింపజేసుకొని మమకారాహంకారములను వీడి, కోర్కెలన్నింటిని వదలి, నిత్యజ్ఞానాభిరతుడైనవాడు ముక్తిని పొందగలడు అని దేవి చెప్పగవినిన కుసుమార్యుడు "ఓ దేవీ! పాపము చేయగూడదని నిశ్చయించుకొన్న మానవుడు గూడా దేనిచే ప్రేరితుడై పాపము చేయుచున్నాడు?" అని ప్రశ్నించెను. అంతదేవి "భూపాలా! రజోగుణజనితమైన కామము,

తద్జాతమైన క్రోధము పాపమునకు హేతువులు. ఈ రెండును మానవునకు మహా శత్రువులు. కామము, బుద్ధిని, మనస్సును, ఇంద్రియములను వశపరచుకొని జ్ఞానవంతుని గూడ మోహములో పడద్రోయుచున్నది. ఇంద్రియముల కంటె మనస్సు శ్రేష్ఠమైనది. మనస్సుకంటే బుద్ధి ఉత్తమమైనది. బుద్ధికంటే శ్రేష్ఠమైనది పరమాత్మ అది నేనే సుమా! రాజా! ఆత్మతో ఆత్మను తెలిసికొని ఆత్మతోనే ఆత్మను నియమించి కామరూప శత్రువును హతమొనర్చువాడు పరమపదమును పొందగలడు. భేదభావమును వదలి సమదృష్టి కలిగి లభించిన దానితో సంతుష్టుడై కర్మాచరణమునందు నిర్లిప్తుడై విషయవాంఛలనుండి విముక్తుడై జ్ఞాన సంపదనొందినవాడు ద్రవ్యయజ్ఞాది క్రియలను ఆచరించినను ఆ క్రియా ఫలములు నాయందేలీనమై పోవును గనుక అవి వానికి బంధహేతువులు కావు.

మానవుని అభ్యున్నతికి సత్సంగత్వము మిక్కిలి అవసరము. సత్సంగత్వము వలన సుగుణసంపద పెంపొందగలదు. ఆపదలు నశించగలవు. లౌకికపారలౌకిక సుఖములు ప్రాప్తించగలవు. సత్సంగత్వము వలన నిస్సంగత్వము, నిస్సంగత్వము వలన నిర్మోహత్వము, నిర్మోహత్వము వలన నిశ్చలత్వము, నిశ్చలతత్వము వలన నిర్మల జ్ఞానము దానివలన జీవన్ముక్తి లభించగలవు. జ్ఞానికాని వారికి ముక్తి కలుగదు. రాజేంద్రా! ఎవడు ఆత్మజ్ఞాన సంపన్నుడో అతడు జ్ఞానబలముతో సర్వసంశయములను తొలగించుకొనును. యోగబలముతో కర్మబంధములను వదలించుకొన్న వానిని ఏదియును బంధింపజాలదు. ఇట్లు జ్ఞానియై క్షేత్రక్షేత్రజ్ఞులను తెలిసికొన్నవాడు నాకు మిక్కిలి ప్రియమైనవాడగును". అని దేవి చెప్పిన పలుకులు విని కుసుమ శ్రేష్ఠి "ఓ జగన్మాతా! క్షేత్రమనగా యేమి? క్షేత్రజ్ఞయనగా యెవరు? దయచేసి వివరించి చెప్పుమని" ప్రార్థించెను.

అంతట ఆ దేవి కరుణించి యీ విధముగ చెప్పసాగినది. ఓ వైశ్యాగ్రణీ! పంచభూతములు, పంచన్మాత్రలు, పంచకర్మేంద్రియములు, పంచ జ్ఞానేంద్రియములు, మనోబుద్ధి, చిత్తాహకాంరము లనెడు అంతఃకరణము, ఇచ్ఛావ్యక్తము, ధైర్యము, ద్వేషము, సుఖము, దుఖము, చేతన అను యీ సంఘాత మంతయును కలిసి క్షేత్రము (దేహము) అనబడును. సర్వక్షేత్రములలో సర్వాంతర్యామినినైయున్న నన్ను క్షేత్రజ్ఞగా తెలియవలెను.

సరళ భావము, గురుసేవ, ఇంద్రియ సుఖముల యందు విరక్తి, సహనము, నిష్కాపట్యము, జననమరణాది విషయ వివేకము, సమదృష్టి, ధృఢభక్తి, ఏకాంతము బాహ్యాంతరేంద్రియ నిగ్రహము మొదలైన వానితో కూడియుండు తెలివియే జ్ఞానమనబడును. అట్టి జ్ఞానముచే తెలియబడదగిన దానను మరియు ప్రకృతి భావములైన త్రిగుణములకు సత్వగుణాధికృత వలన సుఖము, జ్ఞానము ప్రాప్తించగలవు. రజోగుణాధిక్యత వలన భోగాసక్తి, కర్మాసక్తి పెంపొందును. తమోగుణాధికృత వలన నిద్ర, అలసత్వము, కష్టము ప్రాప్తించగలవు.

రాజా! మానవ ప్రకృతి దైవీ,- ఆసురీ మరియు రాక్షసీ అను మూడు విధములుగవుండును. వానిలో కరుణ, అక్రోధము, ధైర్యము, నిశ్చలత్వము, నిర్భయము, సహనము, వినయము, మొదలైన లక్షణములు దైవీప్రకృతి లక్షణములు. నిష్ఠురభావము, మదము, అహంకారము, మిక్కిలి గర్వము, హింసా ప్రియత్వము, ద్వేషము, నిర్దయ, క్రూరత్వము, పరపీడనము, దైవనింద, వేదనింద, శాస్త్రనింద, పాపులతో సాంగత్యము, పరకాంతాభిలాష, పరధనాభిలాష, ఈర్ష్య మొదలైనవన్నియు రాక్షస ప్రకృతి లక్షణములు. రాజా! తపస్సు కూడా కాయిక, వాచిక, మానసిక అను భేదములతో మూడు విధములుగ నుండును. కాంక్షారహితముగ శ్రద్ధతో చేయబడు తపస్సు సాత్విక తపస్సు. ఐశ్వర్యము

కొరకును బహువిధ వాంఛలతోడను చేయు తపస్సు రాజసతపస్సు. ఇతరులకు బాధ కలిగించు కోర్కెతో చేయు తపస్సు తామస తపస్సు.

వరేణ్యా! జ్ఞానమును కూడ మూడు విధములుగ విభజించవచ్చును. సమస్త ప్రాణికోటిలో నన్నే దర్శించుచు జగత్తు మిథ్యయని, సత్యము నిత్యము నైనదానను నేనే అని తెలిసికొనుట సాత్త్విక జ్ఞానమనబడును. నన్ను సమస్త భూతములకంటె వేరుగ యెంచి విభిన్న భావములను పొందు జ్ఞానము రాజసజ్ఞాన మనబడును. హేతుబద్ధము కానిదియు, అసత్యమైనదియు, దేహాత్మలను ఒక్కటిగ భావించునదియునైన జ్ఞానము తామసజ్ఞానమనబడును. అటులనే దానము, కర్మము, సుఖము, దుఃఖము కర్త అనునవి కూడ సాత్త్విక రాజస తామసములను త్రివిధములుగ వుండునని తెలియవలెను.

ఓ రాజా! యోగసిద్ధికొరకై అభ్యాసముతో మనస్సును స్వాధీన మొనర్చుకొనవలెను. మనోజయములేక యోగము మిక్కిలి దుర్లభము అని దేవి చెప్పిన పలుకులను వినిన కుసుమ శ్రేష్ఠి "ఓ దేవదేవేశ్వరీ! మనస్సు మిక్కిలి చంచలమైనదిగ మరల్పశక్యము గానిదిగ వుండును గదా. అట్టిదానిని నిగ్రహించి నిశ్చల యోగమును పొందుట సాధ్యమగునా" అని ప్రశ్నించెను. అంతట ఆ పరమేశ్వరి "ఓ వణిగ్వరా! అభ్యాసము మరియు వైరాగ్యముల వలన మనస్సును స్వాధీనపరచుకొనవచ్చును. జ్ఞాననిష్ఠుడు, తపోనిష్ఠుడు, కర్మనిష్ఠుడు కంటె యోగిశ్రేష్ఠుడు వారందరికంటె నాయందు భక్తిగలవాడు మరింత శ్రేష్ఠుడు" అని చెప్పెను.

అంత కుసుమ శ్రేష్ఠి "జగన్మాతా! భక్తుడే సర్వ శ్రేష్ఠుడని చెప్పుచున్నావు. భక్తి యనగానేమి? భక్తుని లక్షణములెట్టివి? దయతో తెలుపుము." అని ప్రార్థించెను.

అంత దేవదేవి ఓ రాజా! సర్వజగత్తునకు కారణమును, సర్వాంతర్యామిని నైన నా మహత్వశ్రవణము ద్వారా ద్రవీభూతమైన చిత్తమందు నా విషయమై ధారావాహికముగ ప్రవహించు మనో వృత్తియే భక్తియనబడును. నాయందు మనస్సు నిలిపినా యథార్థ తత్త్వమును తెలిసికొనవలెను. తొలుత నాప్రకృతిని తెలిసికొనుట ముఖ్యము.

రాజా! నేను భూమియందు గంధముగ, అగ్నియందు కాంతిగ, సూర్యచంద్రులందు ప్రకాశరూపముగ, నీటియందు రసస్వరూపముగ నెలకొని యుందును. నేను పండితులలో ధీశక్తిగ, తాపసులందు తపశ్శక్తిగ, బలశాలులలో బలముగ విలసిల్లుచుండును. ఎవరే భావముతో నన్ను కీర్తింతురో వారికి ఆ రూపమున దర్శనమిచ్చి కోర్కెలు తీర్చుచుందును. ఏ వ్యక్తి నన్ను స్మరించుచు ప్రాణములను విడచునో అతడు పునర్జన్మలేని మోక్షమును పొందగలడు. ఎవరు నాకు అర్ఘ్య పాద్యస్నానవస్త్రాలంకార ధూపదీప నైవేద్య తాంబూలాదులను సమర్పించి వివిధోపచారములతో భక్తియుక్తులై పూజావ్రత యజ్ఞాదులచే ఆరాధింతురో వారు పరమపదమును పొందగలరు. నన్ను గూర్చిన శ్రవణము, కీర్తనము, స్మరణము, పాద సేవనము, అర్చనము, వందనము, దాస్యము, సఖ్యము, ఆత్మ నివేదనములను తొమ్మిది లక్షణములు గల భక్తితో నన్నర్చించువారు ఉత్తమములైన తమ అభీష్టఫలములను పొందగలరు. నా నామసంకీర్తనము, మంత్రజపము నిరంతరము చేయువారు నన్ను తప్పక జేరుదురు.

శాస్త్రవేత్తలు, వేదవిదులు, యజ్ఞదాన తపశ్చర్యాదినిరతులు కూడ నా యథార్థ స్వరూపమును తెలియజాలరు. భక్తియుక్తులు మాత్రమే నన్ను పొందగలరు. అవ్యక్తమైన నా నిర్గుణ తత్త్వోపాసన చేయువారు కూడా నన్ను చేరుదురు. గాని వారికి క్లేశమధికము.

శుకాది మహర్షులు, నారదాది మునివరేణ్యులు భక్తి యోగము చేతనే నన్ను పొందగలిగిరి. భక్తి యోగమే అత్యంత సరళము, సులభ సాధ్యమైనది. భక్తుడైనవాడు నాకు మిక్కిలి యిష్టుడు.

ఓ వైశ్యవర్యా! ముక్తిని పొందుటకై కర్మయోగము, జ్ఞానయోగము, భక్తియోగము అను మూడు మార్గములు విధించబడినవి. వీనిలో మిక్కిలి సులభమైనది, ధనవ్యయము, శరీరాయాశము మొదలైనవి లేకయే కేవల హృదయము చేతనే నిర్వహింపబడునదై యొప్పు భక్తియోగము ముముక్షువు లందరును తప్పక ఆశ్రయింపదగినది. ఈ భక్తియోగము మానవుల సత్వరజస్తమోగుణ స్వభావభేదముల ననుసరించి మూడు విధములగుచున్నది. ఇతరుల మెప్పును పొందుటకును, పరులకు గలుగు మేలును చెరచుటకును, ఇతరులను పీడించుటకును, నన్ను భజించువాని భక్తి తామసీభక్తిగ రూపొందును. అట్లుగాక స్వార్థముతో ఇహలోకపరలోక సౌఖ్యములను పొందు కోర్కెతో భోగములపై ఆసక్తుడై, కీర్తికాముకుడై ఆయా ఫలములను పొందుటకొరకు నన్ను భక్తితో సేవించుచు జీవేశ్వరులయందు భేదబుద్ధి కలిగి నన్ను తనకంటే వేరుగ భావించుచు భజించు వాని భక్తి రాజసీభక్తి యనబడును. అట్లు గాక అనేక జన్మార్మర్జిత పాపములను పోగొట్టుకొనుటకై వేదవిహితమైన సత్కర్మానుష్ఠానములను దైవార్పణ బుద్ధితో నిరంతరముగావించుచు అది తన కర్తవ్యమను నిశ్చయబుద్ధి కలిగి, నన్ను సంతోషింపజేయుటకు మాత్రమే ఆచరింపబడు భక్తి సాత్వికీ భక్తియగును. అట్టి భక్తి పరాభక్తిని పొందించున దగును. ఈ సాత్వికీభక్తియే ఆశ్రయింపదగినది.

ఓ వరేణ్యా! పూర్వము సృష్టి సమయమున యీ మహోత్తమమైన యోగమును నేను విష్ణువునకు బోధించితిని. అతడు దీనిని సూర్యునకు ఉపదేశించెను. సూర్యుడు మనువునకు ప్రబోధించెను. తదుపరి పారంపర్యముగ మహర్షులు దీనిని దెలుసుకొనిరి.

రాజా! బ్రహ్మవిష్ణు మహేశ్వరులు నా రూపములే అనియు, స్థావర జంగమాత్మకమైన సమస్త విశ్వము నేనే అనియు దెలసికొనుము. ఎప్పుడెప్పుడు యీ ప్రపంచమందు అధర్మము పెరిగి ధర్మమునకు హాని కలుగునో, అప్పుడప్పుడు దుష్టులను శిక్షించుటకు శిష్టులను రక్షించుటకు, ధర్మమును ప్రతిష్ఠించుటకునై నేను అనేక రూపములను ధరించి అవతరించుచుండును. కాని నా దివ్య సముత్పత్తిని మరియు నా లీలలను తెలుసుకొనుట ఎవ్వరికినీ సాధ్యము కాదు. విశ్వమందలి సర్వోత్తమ పదార్థములన్నియు నా లీలా విభూతులే. నన్నెవరే భావముతో అర్చింతురో వారు ఆయా అభీష్టఫలములను పొందుదురు.

ఓ నరోత్తమా! సర్వ మానవులు తమ ధర్మములందు నిష్ఠులై కర్మఫలమునలను నాకు సమర్పించుచు నా అనుగ్రహము వలన పునర్జన్మరహితమైన పరమపదమును పొందగలరు. అనాది సిద్ధము, రహస్యాతిరహస్యమునైన యీ యోగమును నీకిపుడు సాంగోపాంగముగ తెలియజేసితిని.

పుణ్యశీలా! నీవు విన్న మిక్కిలి గుహ్యమైన యీ యోగము యికముందు “వాసవీగీత” అను పేర ప్రసిద్ధినొందగలదు. ఎవడి గీతాశాస్త్రమును అభ్యసించి గురువుద్వారా అర్థమును గ్రహించి నన్ను అర్చించునో అతని యోగక్షేమములను నేనే వహించెదను. ఈ గీతా పఠన మొనర్చువారికి సమస్తములైన కోర్కెలు యీడేరగలవు. అంతమున వారికి తప్పక ముక్తి లభించగలదు.

అని యిట్లు శ్రీకన్యకాదేవి కుసుమశ్రేష్ఠికి పరమాద్భుత తత్త్వజ్ఞానమును ప్రబోధించినది. కుసుమ శ్రేష్ఠికి మోహదుఃఖములు అంతరించినవి. సత్యజ్ఞానము లభించినది. అటుపై ఆ దేవి కుసుమ శ్రేష్ఠితో “ఓ భక్తవరేణ్యా! కాబోవు భవిష్యత్ కార్యగతి

నీకు దృగ్గోచరమగును చూడుము." అని పలికినది. అంత కుసుమ శ్రేష్ఠికి వైశ్య వంశమునకు రాబోవు అగ్ని ప్రవేశము ఆ వెనుక విష్ణువర్ధనరాజు మరణము, విరూపాక్షాది వైశ్యయువకుల కాశీయాత్ర, విరూపాక్ష పట్టాభిషేకము మొదలైన దృశ్యములన్నియు క్రమముగ కనిపించినవి. ఆ ధర్మాత్మునకు వర్ణనాతీతమైన ఆనందానుభూతి కలిగినది. అటుపై శ్రీకన్యకాదేవి తన దివ్యరూపమును చాలించి, ముగ్ధమోహనమైన వాసవీకన్యకారూపమును ధరించినది. అంతలో కుసుమశ్రేష్ఠిని మాయ ఆవరించినది. అతడు శయ్యను జేరి నిశ్చింతుడై గాఢ నిద్రావశుడయ్యెను.